సాక్షి
నిజామాబాద్
మంగళవారం। 12। ఆగస్టు। 2025



ప్రజావాణికి అధికారులు..

ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకావాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸



జిల్లా బేస్‌బాల్ మహిళల..

సుద్దపల్లిలోని బాలికల గురుకులం మైదానంలో జిల్లాస్థాయి బేస్‌బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక నిర్వహించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /23.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఇంజనీరింగ్‌లో మొదటి రోజు ఐదుగురి చేరిక



తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు మూడో విడత కౌన్సెలింగ్‌లో 81 మందిని కేటాయించగా, మొదటి రోజైన సోమవారం ఐదుగురు విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. వీరంతా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)కి చెందిన విద్యార్థులేనని ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి తెలిపారు. కౌన్సెలింగ్‌లో కేటాయించబడిన మరికొంత మంది విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతి సౌకర్యాలను పరిశీలించారన్నారు. అయితే ఈ విద్యాసంవత్సరం హాస్టల్ వసతి కల్పించకపోవడంతో పలువురు విద్యార్థినులు ఇక్కడ అడ్మిషన్ తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు.

తొలి విద్యార్థి అల్లె శ్రీచరణ్

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి అల్లె శ్రీచరణ్ తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో తొలి విద్యార్థిగా అడ్మిషన్ పొందారు. ఆయనకు ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి స్వాగతం పలికి అడ్మిషన్ అందజేశారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

ఖలీల్‌వాడి: ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో గుర్తింపు కార్డు లేదా జిరాక్స్ కాపీని చూపి ట్రాన్స్‌జెండర్లు ఉచిత ప్రయాణం చేయొచ్చని ఆర్ఎం జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, బాలికలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, బాలికలు, సీనియర్ సిటిజన్(మహిళ)లతోపాటు ట్రాన్స్‌జెండర్లు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డులను కండక్టర్‌కు చూపించాలని, మొబైల్ ఫోన్‌ల లో సైతం కార్డులు చూపి ఉచిత ప్రయాణం చేయొచ్చని తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆర్మూర్ నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్లకు రూ.80 కోట్లు అవసరమని, వాటిని మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మంత్రిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి వేరే జిల్లాలను కలుపుతూ ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారని రాకేశ్‌రెడ్డి తెలిపారు.

కౌలు ధర.. తగ్గేదేలే!

- సన్నధాన్యానికి బోనస్ నేపథ్యంలో వరి సాగుకు మరింత మొగ్గు
- రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెరిగిన ఏడాది కౌలు
- తీసుకునేందుకు పట్టాదారులు, ఇచ్చేందుకు కౌలు రైతుల ఉత్సాహం
- జిల్లాలో సుమారు 45 వేల మంది కౌలు రైతులు.. 1లక్ష ఎకరాల్లో ధాన్యం సాగు

సన్న ధాన్యం సాగు చేస్తే ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో కౌలు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఎకరం కౌలు ధర రూ.25 వేల నుంచి ఏకంగా రూ.50వేల వరకు చేరింది. ప్రాంతాన్ని బట్టి భూ యజమానులు కౌలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కౌలు రైతులు వెనుకడుగు వేయడం లేదు. బోనస్ లెక్కలు వేసుకుని కౌలు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సన్నధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్న నేపథ్యంలో వరి పంటకు సంబంధించి కౌలు ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోవిధంగా కౌలు ధరలు ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో గతంలో ఏడాదికి ఎకరానికి రూ.30వేల చొప్పున ఉన్న కౌలు ఈ ఏడాది రూ.50వేల వరకు పెరిగింది. ఇక బాన్సువాడ నియోజకవర్గం మినహా మిగిలిన నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో ఏడాదికి ఎకరం వరి పంట వేసేందుకు కౌలు ధర రూ.25 వేలు ఉండగా ఈ ఏడాది అది రూ.40 వేలకు చేరింది. బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని, రుద్రూర్ తదితర ప్రాంతాల్లో వరి ఎకరానికి సగటున 40 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. మిగిలిన ప్రాంతాల్లో సగటున 30 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలను బట్టి కౌలు ధరల్లో మార్పు ఉంటోంది.

■ బోనస్ ఇస్తున్న నేపథ్యంలో రైతులు కౌలుదార్లకు ఇచ్చేందుకు ధరలు పెంచుతున్నారు. అయితే కౌలు రైతులు సైతం అదనంగా కౌలు చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో సగటున ఎకరానికి రూ.15 వేల వరకు బోనస్ వస్తోంది. అంటే వానాకాలం, యాసంగి రెండు పంటలకు కలిపి రూ.30 వేలు బోనస్ రూపంలో దక్కుతోంది. దీంతో ఒక పంట బోనస్ పెరిగిన కౌలు కింద చెల్లిస్తే మరో పంట బోనస్ తమకు అదనంగా కలసి వస్తుందని కౌలు రైతులు లెక్కలు వేసుకుని పెరిగిన కౌలును చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.

■ జిల్లాలో పంటలు సాగు చేసే భూమి 5.60 లక్షల ఎకరాలు ఉంది. 2.72 లక్షల మంది రైతులు ఉన్నారు. అయితే జిల్లాలో సుమారు 45 వేల మంది రైతులు 1 లక్షకు పైగా ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా ఎకరం వరి పంట సాగుకు సంబంధించి దుక్కి దున్నడం, విత్తనాల కొనుగోలు, దమ్ము చేయడం, ఎరువులు, మందుల కొనుగోలు, వరినాట్లు, కలుపుతీత కూలీ, వరికోత, ధాన్యాన్ని కల్లాలకు తరలించడం, హమాలీ చార్జీలు, బోరు మరమ్మతులన్నీ కలిపి ఒక పంటకు రూ.25 వేలకు పైగా ఖర్చు వస్తోంది. కౌలు డబ్బులు, పెట్టుబడి ఖర్చులు పోగా ఎకరానికి రూ. లక్షకు పైగా రాబడి వస్తోందని కౌలు రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా గడిచిన యాసంగికి సంబంధించి ఇప్పటివరకు బోనస్ రైతులకు చెల్లించలేదు. దీంతో రైతుల్లో కొంతమేర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పట్టాదారులు, కౌలు రైతులు వివిధ రకాల అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

కౌలుతో పాటు అదనంగా బోనస్ వస్తుంది



నేను నాలుగు ఎకరాల పొలాన్ని కౌలుకు ఇచ్చాను. కౌలు ఎకరానికి రూ. 35 వేలకు ఇచ్చాను. అంతేకాకుండా ప్రభుత్వం అందిస్తున్న సన్నరకం వడ్లు క్వింటాలుకు రూ.500 బోనసు డబ్బులు కౌలుదారు, యజమానినైన తను సగం సగం తీసుకోవడానికి నిశ్చయించుకున్నాం. దీంతో కౌలుతో పాటు అదనంగా బోనసు డబ్బులు వస్తున్నాయి.

– పిప్పెర సాయరెడ్డి, తల్వేద గ్రామం, నందిపేట మండలం

ఎకరానికి రూ.50 వేలు చెల్లిస్తున్నాం



గత రెండు సంవత్సరాల నుంచి కౌలు రేట్లు భారీగా పెరిగాయి. ఎకరానికి రూ.50 వేలు కౌలు చెల్లిస్తున్నాం. రెండేళ్ల క్రితం రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు చెల్లించే వాళ్లం. రెండేళ్ల నుంచి అదనంగా ఎకరానికి రూ. 10 వేలు రైతుకు చెల్లిస్తున్నాం. రెండు సంవత్సరాల కౌలు ముందుగానే అందజేస్తున్నాం. దీనివల్ల బాగా నష్టపోవాల్సి వస్తుంది. కూనీపూర్ శివారులో 30 ఎకరాలు కౌలు చేస్తున్నాను. ఎకరానికి రూ. 10 వేల చొప్పున రూ.6 లక్షలు రెండేళ్లకు సరిపడా కౌలును అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

– పల్సర్ కృష్ణ, వెంకటేశ్వర క్యాంప్, వర్ని

బోనస్‌కు బదులు మద్దతు ధర పెంచాలి



నేను పది ఎకరాల పొలం కౌలు తీసుకుని సాగు చేస్తున్నాను. గతంలో ఎకరాకు రూ.15 వేలు కౌలు ధర చెల్లించేవాడిని. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడం ప్రారంభించింది. దీంతో భూయజమానులు వెంటనే కౌలు ధరను అమాంతం పెంచేశారు. ఇప్పుడు ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నారు. బోనస్ డబ్బులు అదనపు ఆదాయం అనుకుంటే పెరిగిన కౌలు వల్ల ఏం ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రభుత్వం ఇలా బోనస్ ఇవ్వకుండా వరికి మద్దతు ధర పెంచితే బాగుంటుంది. కౌలు రేట్లు తగ్గే అవకాశం ఉంటుంది.

– లక్ష్మీ నారాయణ, కౌలు రైతు, ధర్మారం(బి), డిచ్‌పల్లి మండలం

పెట్టుబడి సాయంగా బోనస్ డబ్బులు



నేను నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చే స్తున్నాను. మొత్తం సన్న రకం వడ్లు సాగు చేస్తున్నాను. కాగా సంవత్సరానికి ఎకరానికి కౌలు రూ. 35 వేలు. సన్నరకం దిగుబడిపైన వచ్చిన క్వింటాలుకు రూ. 500 బోనస్ డబ్బులు భూయజమాని, కౌలుదారునైన నేను సగం సగం పంచుకుంటున్నాం. ప్రభుత్వం ఇస్తున్న బోనస్ డబ్బులు పెట్టుబడి ఖర్చుల కిందకు పనికి వస్తున్నాయి.

– వికాస్, కౌలురైతు, తల్వేద గ్రామం, నందిపేట మండలం

లాభసాటిగా ఉంది



ఇటీవల కౌలు పెరగడం వల్ల లాభ సాటిగా ఉంది. రెండు సంవత్సరాల కౌలు డబ్బులు ముందుగానే తీసుకోవడం వల్ల ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం వరి ధాన్యానికి బోనస్ ఇవ్వడం వల్లనే కౌలు ధరలు పెరిగాయి. రెండు పంటలకు ప్రభుత్వం బోనస్ చెల్లించాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు లభిస్తుంది.

– నరెడ్ల గోవర్ధన్, రైతు, జలాల్పూర్

అల్బెండజోల్‌తో దుష్ప్రభావం ఉండదు

- ఆందోళన అవసరం లేదు
- నులిపురుగుల కారణంగా రుగ్మతలు
- 1 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు వేయాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థినికి మాత్ర వేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): అల్బెండజోల్ మాత్రలతో ఎలాంటి దుష్ప్రభావం ఉండదని, ఆందోళనకు చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిజామాబాద్ నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీహెచ్ఎస్‌లో జిల్లా అధికారులతో కలిసి బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలను కలెక్టర్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 01 నుంచి 19ఏళ్ల వయస్సు వారందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలన్నారు. జిల్లాలో 4 లక్షల మందికి అల్బెండజోల్ మాత్రలు వేయడం లక్ష్యమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీల్లో ఏ ఒక్కరూ తప్పిపోకుండా పిల్లలు మాత్రలు వేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని విద్య, వైద్యారోగ్య శాఖల అధికారులను ఆదేశించారు. ఎవరైనా తప్పిపోతే ఈనెల 18న మలి విడతగా చేపట్టే కార్యక్రమంలో తప్పనిసరిగా మాత్ర వేసేలా చూడాలన్నారు. నూటికి నూరు శాతం విజయవంతమయ్యేలా వైద్య, విద్యా శాఖతోపాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నులి పురుగుల కారణంగా పిల్లలు ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారని వివరించారు. 1,009 మంది విద్యార్థులతో కొనసాగుతున్న బోర్గాం(పీ) జెడ్పీహెచ్ఎస్ నిర్వహణపై ప్రజల్లో సదాభిప్రాయం ఉందని, దీనికనుగుణంగా స్కూల్‌లో అవసరమైన వసతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అవసరమైతే ఈ విషయంలో రాష్ట్రస్థాయిలోని ఉన్నతాధికారులను సంప్రదించి సౌకర్యాల మెరుగుదలకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీఈవో అశోక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, పాఠశాల హెచ్ఎం శంకర్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహమేదీ...?

- నెమ్మదించిన వన మహోత్సవం
- నామమాత్రంగానే మొక్కలు నాటిస్తున్న అధికారులు
- ఇప్పటి వరకు సగం లక్ష్యాన్నే చేరుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- వర్షాలు కురుస్తున్నా కనిపించని పురోగతి



మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): వన మహోత్సవాన్ని ఈ ఏడాది అధికారులు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. వర్షాకాలం మొదలై రెండు నెలలు కావొస్తున్నా జిల్లాలో అంతంత మాత్రంగానే మొక్కలు నాటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా ప్లాంటేషన్ పుంజుకోవడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి మొదలుకొని జిల్లా అధికారుల వరకు వన మహోత్సవాన్ని లైట్‌గా తీసుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మొక్కలు నాటడంలో కీలకంగా వ్యవహరించాల్సిన గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్సాహన్ని ప్రదర్శించడం లేదు. గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటి వరకు సగం లక్ష్యాన్నే చేరుకుంది. 2025–26 సంవత్సరంలో 16.84లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా మండలాలకు టార్గెట్లు ఇచ్చింది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 3,178 మొక్కలు నాటించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అందుకనుగుణంగా జీపీ నర్సరీల్లో మొక్కలను భారీగా పెంచారు. అయితే మొక్కలు బాగా నాటుకోవాలంటే జూలై, ఆగస్టు నెలల్లో ప్లాంటేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి. కానీ, మొదట్లో వర్షాల్లేక మొక్కలు నాటలేదు. ఇప్పుడు గత నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నా కూడా మొక్కలను వేగంగా నాటడం లేదు. భారీగా గుంతలు తవ్వించి మొక్కలు నాటించేందుకు ఉపాధి కూలీలను పిలవడం లేదు. వచ్చిన వారితోనే నెట్టుకొస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 879 ప్రాంతాల్లో 8.87లక్షల మొక్కలను (లక్ష్యంలో 52.66శాతం) మాత్రమే నాటారు. 7.97లక్షల మొక్కలు నాటాల్సి ఉంది.

సగం మండలాల్లో..

మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించగా జిల్లాలో సగం మండలాల్లో వన మహోత్సవం కార్యక్రమం నెమ్మదిగా సాగుతోంది. నవీపేట్, ఇందల్వాయి, ధర్పల్లి, నందిపేట్, డిచ్‌పల్లి మండలాల్లో కనీసం 40శాతం కూడా లక్ష్యాన్ని చేరుకోలేదు. సిరికొండ, ఎడపల్లి మండలాలు 50శాతం దాటకపోగా... చందూర్, మోస్రా, రుద్రూర్, భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మాక్లూర్ మండలాలు 50 శాతాన్ని మాత్రమే దాటాయి. జిల్లాలో జక్రాన్‌పల్లి మండలం 95.83శాతం, మోర్తాడ్ మండలాలే 92.83 శాతం మొక్కలు నాటి ముందు లక్ష్యానికి అడుగు దూరంలో ఉన్నాయి. మిగతా మండలాలు 55–65 శాతం మధ్యలో ఉన్నాయి. మొక్కలు నాటే విషయంలో వెనుబడ్డ మండలాలు, గ్రామ పంచాయతీలపై దృష్టి పెట్టని అధికారులు, అక్కడ పని చేస్తున్న ఉపాధి హామీ సిబ్బందిని అధికారులు మందలించడానికి కూడా ముందుకు రావడం లేదు.

దృష్టి పెడతాం

లక్ష్యానికనుగుణంగా మొక్క లు నాటేందుకు చర్యలు చేపడుతున్నాం. కొంత వెనుకబడినా వేగవంతం చేస్తాం. పురోగతి కనిపించని మండలాలు, గ్రామాలపై దృష్టి సారిస్తాం. అక్కడి సిబ్బందితో రోజువారీగా సమీక్షించి మొక్కలు నాటిస్తాం. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– సాయాగౌడ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

ఆటంతా అజ్జదే..

- సీఎంసీ వ్యవహారంపై సర్వత్రా చర్చ
- ప్రారంభానికి ముందే కేసులు, కోర్టులు
- ఐఎంఏ పేరును విచ్చలవిడిగా వాడుకున్నారనే ఆరోపణలు
- మెడికల్ కళాశాలలో ఉద్యోగాల పేరుతో డబ్బుల వసూలు!
- ఏప్రిల్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేసిన షణ్ముగం మహాలింగం



నిజామాబాద్‌నాగారం: క్రిస్టియన్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి ప్రారంభానికి ముందే వివాదాలకు కేంద్రమైంది. గ్రామీణులకు వైద్య సేవలందించడంతోపాటు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన వారి వద్దకు ఐఎంఏ ముసుగులో చొచ్చుకువెళ్లిన ప్రముఖవైద్యుడు అజ్జ శ్రీనివాస్ వారిని బెదిరించి అసత్య ప్రచారం చేశారని తెలిసింది. అజ్జ శ్రీనివాస్ ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని, వైద్య పరికరాల సప్లై వ్యవహారంలో చీటింగ్ చేశారని చైర్మన్ షణ్ముగం మహాలింగం ఏప్రిల్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంతా తానే అవ్వాలనే అత్యాశతో..

కేంద్ర, రాష్ట్ర సర్వీసుల్లో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వారు ఒక బృందంగా ఏర్పడి మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు ప్రారంభించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా డిచ్‌పల్లిలోని సీఎంసీని లీజుకు తీసుకుని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని ప్రారంభించేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. ఆ కమిటీకి షణ్ముగం మహాలింగం చైర్మన్‌గా ఉంటూ ఆస్పత్రి ప్రారంభం, మెడికల్ కళాశాల అనుమతులకు సంబంధించి వ్యవహారాలు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. వైద్యుడిగా తాను పని చేస్తానని కమిటీతో శ్రీనివాస్ మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో మహాలింగం, శ్రీనివాస్ మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. దీన్ని అవకాశంగా మల్చుకున్న శ్రీనివాస్.. వరో ఇద్దరు వైద్యులతో కలిసి ఆస్పత్రి ప్రారంభానికి అవసరమయ్యే వైద్య పరికరాల సప్లై బాధ్యతల్లో సైతం తలదూర్చారు. తనకు డైరెక్టర్‌గా అవకాశం ఇవ్వాలని, తన వంతుగా రూ.5 కోట్లు పెట్టుబడిగా పెడతానని ఒప్పందం చేసుకుని కమిటీకి చెక్కు(ఐఎంఆర్సీ పేరుతో)లు సైతం ఇచ్చాడు.

మలుపు తిరిగింది ఇక్కడే..

చైర్మన్‌గా ఉన్న మహాలింగం అనారోగ్య కారణాలతో కొంతకాలంపాటు సీఎంసీ వైపు రాలేదు. ఇక్కడే అజ్జ శ్రీనివాస్ కథ మలుపు తిప్పారు. త్వరలోనే సీఎంసీ ప్రారంభమవుతుందని, తాను డైరెక్టర్‌గా ఉన్నానని ప్రచారం చేసుకున్నారు. కమిటీకి తాను ఇచ్చిన చెక్కులను చూపి వైద్యులను, ఇతర స్టాఫ్‌ను నియమించేశాడు. ఈ క్రమంలో పలువురు వైద్యుల నుంచి రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి.

వేతనాలు ఇవ్వకపోవడంతో వివాదం

అజ్జ శ్రీనివాస్ చెప్పిన మాటలను నమ్మి సీఎంసీలో ఉద్యోగులుగా చేరిన వైద్యులు, స్టాఫ్ తమకు జీతాలు ఇవ్వడం లేదని ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడి నుంచి వివాదం మొదలు కావడం, వైద్య పరికరాల సప్లై వ్యవహారం పంచాయితీ కావడం, తాను కమిటీకి ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో శ్రీనివాస్ అప్రమత్తమయ్యాడు. సీఎంసీ పేరుతో షణ్ముగం మహాలింగం డబ్బులు వసూలు చేసి పరారయ్యాడని గత నెల 5న డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ రోజు నుంచి సీఎంసీ మోసమంటూ ప్రచారం చేయడం మొదలుపెట్టిన ఆయన 8వ తేదీన మరోసారి, 13న ఇంకోసారి మహాలింగంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పలుకుబడి ఉపయోగించి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాడు. వివాదం ముదరడంతో అంతా సైలెంట్ అయ్యారు.

ఏప్రిల్ నుంచే అజ్జపై ఫిర్యాదులు

అయితే తమను మోసం చేయడంతోపాటు వేధిస్తున్నాడని సీఎంసీ కమిటీ అజ్జ శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తూనే ఉంది. ఈ విషయం ఎక్కడా బయటికి తెలియలేదు. వైద్య పరికరాల సప్లైలో అజ్జ శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు వైద్యులు తమను చీటింగ్ చేశారని జూన్‌లో, శ్రీనివాస్ ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని జూలైలో షణ్ముగం మహాలింగం లీగల్ నోటీసులు పంపించారు. సీఎంసీ వ్యవహారంపై డాక్టర్ అజ్జ శ్రీనివాస్‌ను 'సాక్షి' వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆయన స్పందించలేదు.

నిరాశాజనకంగా నిజాంసాగర్

- అలీసాగర్ వరకు 1.3 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- పంటలు గట్టెక్కాలంటే మరో నాలుగు తడులు అవసరం
- వెలవెలబోతున్న ప్రాజెక్టు.. వరుణుడి కరుణపైనే ఆశలు



నిజాంసాగర్: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు వెలవెలబోతోంది. దీంతో ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరుణుడు కరుణిస్తే తప్ప ఆయకట్టు గట్టెక్కే పరిస్థితులు కనిపించడం లేదు. నిజాంసాగర్ ప్రాజెక్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.15 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాలువకు ఇరువైపులా మోటార్లు ఏర్పాటు చేసి మరో 15 వేల ఎకరాల వరకు అనధికారికంగా పంటలు పండిస్తున్నారు.

రెండు విడతల్లో 1.58 టీఎంసీలు..

ఈ సీజన్‌లో నిజాంసాగర్ ఆయకట్టుకు ఇప్పటి వరకు రెండు విడతల్లో 1.58 టీఎంసీల నీటిని విడుదల చేశారు. జూన్ 25 నుంచి జూలై 9 వరకు మొదటి దఫాలో 0.766 టీఎంసీల నీరందించారు. అదేనెలలో 15 నుంచి 23 వరకు రెండో దఫాలో 0.814 టీఎంసీల నీరు విడుదల చేశారు. అయితే వర్షాకాలం ఆరంభం నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 1.224 టీఎంసీల నీరు మాత్రమే వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.203 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీలో 0.9 టీఎంసీ ఉంటుంది.

ఎగువనుంచి ఆశలు అంతంతే..

ఎగువన సింగూరు ప్రాజెక్టుతోపాటు కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లు ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టు హైదరాబాద్ ప్రాంతంతోపాటు మిషన్ భగీరథ గ్రిడ్‌కు తాగు నీటి సరఫరాకు పరిమితమైంది. సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుతం 20 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కొండ పోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు నిరాశాజనకంగా ఉండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. వర్షాల కారణంగా ప్రస్తుతానికి ప్రాజెక్టులోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. పంటలు గట్టెక్కాలంటే నాలుగు తడులైనా నీరివ్వాల్సి ఉంటుందని, కానీ ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటితో నాలుగు తడులు ఇవ్వలేమని ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ అంటున్నారు.

క్లుప్తంగా

పోలీస్ ప్రజావాణికి 22 ఫిర్యాదులు



ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా ప్రధాన కార్యాలయంలో సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య 22 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్సై, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజలు నిర్భయంగా, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీసు శాఖ పని చేస్తుందన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు తేజస్



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన తేజస్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ వాటర్ పోలో పోటీలు జూలై 26న హైదరాబాద్‌లో నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన తేజస్ ఈ నెల 13 నుంచి 17వరకు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గడీల రాములు, కార్యదర్శి గాంధారి మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఖైసర్ తదితరులు తేజస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని గాయత్రినగర్, సాయినగర్ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని టౌన్–1 ఏడీఈ (ఆపరేషన్) ఆర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గాయత్రినగర్, ఆకుల పాపన్న రోడ్డు, విశ్వవికాస్ స్కూల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాగే ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గాయత్రినగర్ రోడ్ నంబర్ 1 నుంచి 8 వరకు, సిద్ధి వినాయక దేవాలయం, గాయత్రి మాతా ఆలయ ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని చంద్రశేఖర్ కోరారు.

ప్రజావాణికి అధికారులు హాజరుకావాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం
- పలువురి గైర్హాజరుపై అసహనం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు

నిజామాబాద్ అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పంపించొద్దని, జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణిలో పాల్గొనాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో జిల్లా అధికారుల హాజరును పరిశీలించేందుకు అటెండెన్స్ తీసుకోవాలని సూచించారు. సోమవారం ఐడీవోసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 83 వినతులు అందగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణికి పలు శాఖల జిల్లా అధికారులు గైర్హాజరు కావడం, మరికొందరు కిందిస్థాయి అధికారులను పంపించడంపై కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎంతో కీలకంగా భావించే ప్రజావాణికి జిల్లా అధికారులు గైర్హాజరు కావడం సమంజసం కాదన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణిలో తప్పక ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎవరికైనా అత్యవసర పని ఉంటే, ముందుగానే తమ దృష్టికి తేవాలని సూచించారు. అనుమతి లేకుండా ప్రజావాణికి గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజావాణిలో ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీవో సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్ రావు, మెప్మా పీడీ రాజేందర్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల చదువులకు 'విద్యాలక్ష్మి'



మీకు తెలుసా?

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి విద్యాలక్ష్మి' పథకం అమలు చేస్తోంది.

- ఇంజినీరింగ్, వైద్య ఇతర వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదివే విద్యార్థులకు తోడు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసే వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.
- పేదల చదువుకు హామీ పత్రాలు అవసరం లేకుండానే తక్కువ వడ్డీతో బ్యాంక్ రుణం పొందే అవకాశం కల్పిస్తోంది.
- గూగుల్‌లో https://pmvidyalaxmi.co.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, చిరునామా నమోదు చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక సాధారణ విద్యారుణ దరఖాస్తు పత్రం(సీఈఎల్‌ఏఎఫ్) పూర్తి చేయాలి.
- పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాతోపాటు ఆదాయ ధ్రువీకరణపత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- అర్హులైన పేదలకు మూడు విభాగాల్లో రుణం మంజూరు అవుతుంది.
- మొదటి విభాగంలో రూ.4లక్షల లోపు, రెండో విభాగంలో రూ.4లక్షల నుంచి 7.5 లక్షలు, మూడో విభాగంలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ రుణం అందిస్తారు.
- దరఖాస్తు చేసుకునే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.4లక్షల లోపు ఉండాలి.

– సదాశివనగర్ (ఎల్లారెడ్డి)



పచ్చందనమే.. పచ్చదనమే

రహదారికి ఇరువైపులా ఉన్న పచ్చదనం, ప్రకృతి అందాలు వీక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చుట్టూ గుట్టలు, కనుచూపుమేరలో పచ్చని పొలాలతో నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి వెళ్లే దారి కనువిందు చేస్తోంది. ఈ దారిలో ప్రయాణం అరకు అనుభూతిని కలిగిస్తుంది. ఈ ప్రాంతంలో కేవలం వర్షపు నీటి ఆధారంగా గిరిజనులు గుట్టలపై మొక్కజొన్న, పెసర, మినుపు వంటి పంటల్ని సాగుచేస్తుంటారు. ఈ దారి గుండా వెళ్లే ప్రయాణికులకు ఈ పచ్చని సోయగాలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

సొసైటీ డైరెక్టర్ల రాజీనామా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు

నిజామాబాద్‌అర్బన్: బోధన్ మండలంలోని సంగం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు రాజీనామా పత్రాలు సమర్పించారు. అనంతరం సంగం సొసైటీ అధ్యక్షుడు ముత్తారెడ్డి, సభ్యులు మాట్లాడుతూ సొసైటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అనేకసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ అధ్యక్షుడు ముత్తారెడ్డితోపాటు 10మంది డైరెక్టర్లు రాజీనామా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

జిల్లా బేస్‌బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక



ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్ నళిని, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినోద్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలం సుద్దపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడామైదానంలో సోమవారం జిల్లాస్థాయి బేస్‌బాల్ మహిళల ప్రాబబుల్స్ జట్టు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నళిని క్రీడాకారిణులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారిణులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎంపికైన క్రీడాకారిణులకు మూడు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా తుది జట్టును ఎంపిక చేసి ఈ నెల 16 నుంచి 18 వరకు ఆదిలాబాద్ జిల్లాలోని ఐపీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, సాఫ్ట్‌బాల్ కోచ్ మౌనిక, పీఈటీ జ్యోత్స్న, నర్మద, సీనియర్ క్రీడాకారిణులు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్: వ్యవసాయ భూమి దున్నడంతోపాటు ఆపాలని చెప్పినందుకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జాడె సుస్మిత సోమవారం తెలిపారు. మంచిప్ప గ్రామశివారులో అమ్మల శ్రావణ్ వ్యవసాయ భూమికి కొద్ది దూరంలో తలారి సాయన్న భూమి ఉంది. గత నెల 21న తన భూమిలో ట్రాక్టర్‌తో దున్నుతున్న తలారి సాయన్నను ఆపాలని శ్రావణ్ కోరాడు. దున్నడం ఆపకపోగా సాయన్నతోపాటు ఆయన కుమారుడు నిఖిల్, అల్లుడు మనోహర్ కలిసి శ్రావణ్‌పై పిడిగుద్దులతో దాడి చేశారు. నిఖిల్ రాడ్‌తో తలపై కొట్టాడు. గాయాలపాలైన శ్రావణ్ 15రోజులకు పైగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అంతేగాకుండా తలారి సాయన్న కుటుంబీకులు శోభ, లక్ష్మి కలిసి శ్రావణ్ తల్లిని విపరీతంగా కొట్టారు. సోమవారం శ్రావణ్ ఫిర్యాదు మేరకు సాయన్న, నిఖిల్, మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుస్మిత తెలిపారు.

వరద కాలువకు నీటి విడుదల నిలిపివేత



మూసిన వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ గేట్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదలను నిలిపి వేసినట్లు వరద కాలువ డిప్యూటీ ఈఈ గణేశ్ తెలిపారు. కాకతీయ కాలువకు 3 వేలు, లక్ష్మి కాలువకు 150, సరస్వతి కాలువకు 200, అలీసాగర్ లిఫ్ట్‌కు 360, గుత్ప లిఫ్ట్‌కు 135, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి ఆవిరి రూపంలో 482 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1080.00(45 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

తగ్గిన వరద..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 35 వేల క్యూసెక్కులు వచ్చిన వరద నీరు సోమవారం ఉదయం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి ప్రాజెక్ట్‌లోకి 13,952 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

పతకాలు సాధించిన అథ్లెట్స్‌కు సన్మానం



నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్స్, పీఈటీలతోపాటు జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించిన జైపాల్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరాల రత్నాకర్ ఘనంగా సన్మానించారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో జిల్లాలో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్ నిర్మిస్తుందన్నారు. అథ్లెటిక్స్‌ని ప్రోత్సహిస్తున్న పాఠశాలల కరస్పాండెంట్లు, తల్లిదండ్రులను అభినందించారు. ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల సమిష్టి కృషి ఫలితంగానే అథ్లెటిక్స్‌లో విజయాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు మరింత ప్రోత్సహిస్తే జాతీయస్థాయిలో రాణిస్తారని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం నిర్వహించిన రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రం నుంచి జీపీలు, మున్సిపాలిటీలకు నేరుగా నిధులు ఇస్తేనే అభివృద్ధి జరుగుతుందని రాజీవ్ గాంధీ భావించారని గుర్తుచేశారు. ఆర్టికల్ 72,73 రాజ్యాంగ సవరణతో గ్రామ పంచాయతీలకే హక్కులు కల్పించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌జీపీఆర్‌ఎస్ జోనల్ ఇన్‌చార్జి మోత్కురి నవీన్, నాయకులు సురేశ్ బాబా, పొలసాని శ్రీనివాస్, సంతోష్ రెడ్డి, ఇందూరు శేఖర్, వెంకటేశ్వర పటేల్, ఇట్టం జీవన్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) గ్రామానికి చెందిన సంగేవార్ ప్రకాశ్(44) జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ప్రకాశ్ వృత్తి రీత్యా కుట్టుమిషన్ మెకానిక్. ఆదివారం రాత్రి సుమారు రాత్రి 11 గంటల సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు ఇంటి ఎదుట ఉన్న డ్రెయినేజీలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన భార్య చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ ప్రకాశ్ మృతి చెందాడు. మృతుడి భార్య సంగేవార్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మూడున్నర తులాల బంగారం చోరీ

మోపాల్: మండలంలోని గుడి తండాకు చెందిన రత్నావత్ గంగా అలియాస్ హారిక ఇంట్లో నుంచి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై జాడె సుస్మిత సోమవారం తెలిపారు. గత నెల 27న కుమారుడి జన్మదినం సందర్భంగా బంగారు ఆభరణాలు ధరించారు. తిరిగి ఎప్పటిలాగే బీరువాలో దాచిపెట్టారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా 8న బీరువా తెరిచి చూడగా, బంగారు ఆభరణాలు కన్పించలేదు. ఇంట్లో అంతా వెతికినా లభించకపోవడంతో చోరీకి గురైనట్లు నిర్ధారణకు వచ్చిన హారిక సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

నలుగురికి రెండు రోజుల సాధారణ జైలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో సోమవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. నలుగురు వ్యక్తులకు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

'డయల్ 100' దుర్వినియోగంపై ఒకరికి జైలు

ధర్పల్లి: డయల్ 100ను దుర్వినియోగం చేసిన ఓ వ్యక్తికి కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్‌కు చెందిన కేతావత్ పరశురాం తీజ్ పండుగ సందర్భంగా ఇటీవల మండలంలోని డీబీ తండాలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. మద్యం సేవించి ఈ నెల 8న డయల్–100కు పలుమార్లు ఫోన్‌చేసి పోలీసుల విధులను దుర్వినియోగం పరిచాడు. దీంతో పోలీసులు పరశురాంపై కేసు నమోదు చేసి సోమవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కళ్యాణి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని బజాన్ చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 8712686173ను సంప్రదించాలని తెలిపారు.

సేవా సంస్థలో చోరీకి యత్నం



ఖలీల్‌వాడి: నగరంలోని గుర్బాబాది రోడ్ కెనాల్ కట్ట ప్రాంతంలో ఉన్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం దుండగుడు చోరీకి యత్నించాడు. మధ్యాహ్న సమయంలో కార్యాలయ తాళాలు పగులగొట్టి లోనికి చొరబడేందుకు ప్రయత్నించాడు. ఇందూరు యువత సిబ్బంది కార్యాలయానికి వచ్చేసరికి డోర్స్ తెరిచి ఉన్నాయి. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి మూడో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయమై ఎస్సై హరిబాబును వివరణ కోరగా చోరీయత్నం జరిగిందని, దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఠాణాలో చేయి కోసుకున్న యువరైతు

- భూ సమస్యను పరిష్కరించాలని ఆత్మహత్యాయత్నం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): భూ వివాదాన్ని పరిష్కరించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన సిద్ధిగారి యాదగిరి అనే యువరైతు సోమవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బ్లేడ్‌తో చేయికోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఎస్సై భార్గవ్‌గౌడ్ వెంటనే యాదగిరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ, అందుకు యాదగిరి సహకరించకపోవడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తన తండ్రి రాములు గతంలో గ్రామానికి చెందిన కొందరి వద్ద సుమారు రెండున్నర ఎకరాల భూమిని కొనుగోలు చేశాడన్నారు. ధరణి వచ్చిన తర్వాత తమ భూమి గ్రామానికి చెందిన ఇతరుల పేరిట నమోదైందని, ఈ విషయమై పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడితో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో సమావేశమైన జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: జిల్లాలో ప్రతి బూత్‌స్థాయిలో బీజేపీ బలోపేతంపై దృష్టి సారించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ కార్యక్రమాలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం దినేశ్ పటేల్ కులాచారి మాట్లాడుతూ ప్రతి బూత్‌ను బీజేపీ బూత్‌గా చేయడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలి



నిజామాబాద్ సిటీ: బీసీల రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలన్నారు. సామాజికంగా వెనుకబడిన తరగతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్, పదేళ్లుగా అధికారంలో బీజేపీ ప్రభుత్వం జనాభాకనుగుణంగా కులగణన చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రమేశ్ బాబు, నూర్జహాన్, వెంకటేశ్, నన్నేసాబ్, గంగాధర్, బెజుగం సుజాత, జంగం గంగాధర్, విఘ్నేశ్, నాయక్‌వాడి శ్రీనివాస్, కటారి రాములు, అనసూయమ్మ, శ్రీదేవి, నరేశ్, మహేందర్, శేఖర్ గౌడ్, నరేష్, ఒడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకళల రక్షణకు ప్రయత్నించాలి



సాంస్కృతిక కళావేదిక నూతన కార్యవర్గం

నిజామాబాద్ రూరల్: ప్రజాకళల రక్షణకు ప్రయత్నించాలని, జానపద ప్రజా కళాకారుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా సాంస్కృతిక కళావేదిక కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు సిర్ప లింగయ్య తెలిపారు. నగరంలో నాందేవ్‌వాడలోని పెన్షనర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులను సామాజిక మార్పులో భాగస్వాములుగా చేసేందుకు సాంస్కృతిక వేదిక కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సిర్ప లింగయ్య, అబ్దుల్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు, ఉపాధ్యక్షులుగా ఇందూరు సాయిబాబా, శంకర్ గౌడ్, నర్సారెడ్డి, రాధాకిషన్, విజయమాల, సహాయ కార్యదర్శిగా చంద్రకళ, రంజిత్, మధుసూదన్ గౌడ్, శ్రీనివాస్, డి.సాయిరాం తదితరులను నియమించారు.

మాజీ సర్పంచ్‌పై రౌడీషీట్

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్ మాజీ సర్పంచ్ అశోక్‌పై పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు. ఇది వరకు ఆయనపై పది కేసులు ఉన్నాయని వాటి ఆధారంగా రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరిఫ్ తెలిపారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా తమ పార్టీ నాయకులపై కేసులు పెడుతోందని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడుతున్నారు.

భార్యతో ఫోన్ మాట్లాడుతూ భర్త ఆత్మహత్య

- కాపురానికి రావట్లేదని మనస్తాపంతో..

మద్నూర్(జుక్కల్): 'ఎన్ని నెలలైంది నువ్వు ఇక్కడికి వస్తలేవు.. నిన్ను అన్ని రకాలుగా బాగా చూసుకుంటాను. ప్లీజ్ వచ్చేయ్' అంటూ భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉరేసుకొని భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్నూర్ మండలం మేనూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై విజయ్ కొండ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేనూర్‌కి చెందిన సాబ్లె సాయిలు(31)కు నాలుగు సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని ఫైజ్‌పూర్ గ్రామానికి చెందిన శోభతో వివాహమైంది. మనస్పర్ధలతో ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిన శోభ తిరిగి రాలేదు. ఈ క్రమంలో సోమవారం శోభకు సాయిలు ఫోన్ చేశాడు. కాపురానికి రావాలని బ్రతిమిలాడాడు. తర్వాత ఏమైందో తెలియదు కానీ ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. తల్లి సరుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..



నరేశ్ మృతదేహం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామానికి చెందిన కైరి నరేశ్(39) మద్యానికి బానిసై తన భార్యతో గొడవపడి మూడు నెలల క్రితం ఫత్తేపూర్ గ్రామానికి వచ్చాడు. అక్కడే ఉంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగించాడు. సోమవారం జీవితంపై విరక్తితో గుళికల మందు తాగి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి కైరి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.